క్లుప్తంగా

నేడు శివాజీ జయంత్యుత్సవం

ఇబ్రహీంపట్నం: హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు ఇబ్రహీంపట్నంలో ఛత్రపతి శివాజీ జయంతిని నిర్వహించనున్నట్లు ఆ సమితి సభ్యుడు రమేశ్ తెలిపారు. స్థానిక చెరువు కట్టపై శివాజీ విగ్రహం వద్ద ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. హిందూ బంధువులందరూ ఉత్సవాల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

బైక్ ర్యాలీ

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని బాటసింగారంలో శివాజీ చౌక్ వద్ద సోమవారం సాయంత్రం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంత్యుత్సవం నిర్వహించనున్నారు. మండల కేంద్రం నుంచి బాటసింగారం వరకు బైక్ ర్యాలీ తీయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. యువత పెద్ద ఎత్తున హాజరై వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ఈ నెల 19న (సోమవారం) ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ పీఆర్‌ఓ పాషా ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నవ వధువుకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న రమేశ్

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండాకు చెందిన కిషన్ కుమార్తె వివాహానికి తండాకు చెందిన రాత్లావత్‌రమేశ్ రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. తండాలో వివాహం చేసుకునే ఆడపడుచులకు రూ.10 వేలు సాయం అందిస్తామని రాత్లావత్ రమేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు జయరాంనాయక్, నందురాథోడ్, వినోద్‌నాయక్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

'పాలమూరు న్యాయయాత్ర'కు నాయకులు

తలకొండపల్లి: పాలమూరు న్యాయయాత్ర చేపట్టిన ఏఐసీసీ నాయకుడు చల్లా వంశీచంద్ రెడ్డిని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. న్యాయయాత్ర మహబూబ్‌నగర్ నియోజకవర్గం రాజాపూర్ మండలంలో కొనసాగుతోంది. పాదయాత్రలో ప్రభాకర్‌రెడ్డితో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాసమూర్తి, మాజీ ఉప సర్పంచ్ నర్సింహులు, వెంకట్‌రెడ్డి, అశోక్ బాబు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీలో విద్యార్థుల ప్రతిభ



బహుమతి అందుకుంటున్న వివేకా విద్యాభారతి బాలికల టీమ్

ఆమనగల్లు: మండలంలోని శెట్టిపల్లిలో మూడు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో ఆమనగల్లు పట్టణానికి చెందిన వివేకా విద్యాభారతి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. టోర్నమెంట్‌లో పాఠశాల స్థాయి విభాగంలో బాలురు, బాలికల టీమ్‌లు పాల్గొన్నాయి. బాలికల విభాగంలో వివేకావిద్యాభారతి ఉన్నత పాఠశాల టీమ్ మూడో బహుమతి, బాలుర విభాగంలో నాల్గవ బహుమతిని గెలుచుకున్నాయి. విజేతలకు నిర్వాహకులు ఎగిరిశెట్టి సత్యం నగదు బహుమతి, షీల్డులను అందించారు. విద్యార్థులను వివేకావిద్యాభారతి కరస్పాండెంట్ గోలి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ మహమూద్, పీఈటీలు ఆనంద్, మల్లేశ్‌లు అభినందించారు.

రైతన్నతోనే దేశం సుభిక్షం

పర్యావరణ బాల చైతన్య కేంద్రం నిర్వాహకుడు రజనీకాంత్

కందుకూరు: మండల పరిధిలోని సాయిరెడ్డిగూడ లోని పర్యావరణ బాల చైతన్య కేంద్రంలో యోగాసనాల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం రైతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పర్యావరణ బాల చైతన్య కేంద్రాల నిర్వాహకుడు రజనీకాంత్ మాట్లాడుతూ.. అన్నం పెట్టే రైతులు దేశానికి వెన్నుముఖలాంటి వారని.. వారికి ఎంత చేసినా తక్కువేనన్నారు. రైతు ఆనందంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. రైతులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గూడులేని గ్రంథాలయం

గ్రంథాలయమంటే విజ్ఞాన భాండాగారం. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో అది కునారిల్లుతోంది. ప్రతీ వ్యక్తి ఉన్నతంగా ఎదగాలంటే పుస్తక పఠనం అవసరం. వాటన్నింటికీ మూలం సాహిత్యమే. మనిషి జీవితంలో మార్పు సాధించాలంటే చదువు కీలకం. జీవితంలో చదువు ద్వారానే మార్పు సాధ్యం. పది మందికి విజ్ఞానాన్ని పంచే గ్రంథాలయాలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. మినీ గ్రంథాలయం అభివృద్ధికి చొరవ తీసుకోవాలని విద్యార్థులు, సాహిత్యాభిమానులు వేడుకుంటున్నారు.



కడ్తాల్ గ్రామీణ గ్రంథాలయం

నేటికీ మినీ గ్రంథాలయమే దిక్కు

- కనీస సౌకర్యాలు లేక పాఠకుల ఇక్కట్లు
- లైబ్రరీ స్థాయి పెంచాలని డిమాండ్

కడ్తాల్: మండల కేంద్రంలో పాతికేళ్ల క్రితం ఏర్పాటు చేసిన మినీ గ్రామీణ గ్రంథాలయమే నేటికి కొనసాగుతోంది. కడ్తాల్ మండలంగా ఆవిర్భవించి ఎనిమిది సంవత్సరాలు దాటినా గ్రంథాలయ స్థాయిని పెంచలేదు. ఇప్పటికీ సొంత భవనం కూడా లేదు. దీనికితోడు పుస్తకాల సమస్య కూడా పాఠకులను వెంటాడుతోంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రంథాలయ స్థాయి పెంచి, సొంత భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాట నిలబెట్టుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. దినదినాభివృద్ధి చెందుతున్న కడ్తాల్ పట్టణంలో గ్రంథాలయం స్థాయి పెంచి, నూతన భవనాన్ని నిర్మించాలని పాఠకులు, నిరుద్యోగులు, విద్యార్థులు కోరుతున్నారు.

నిరుద్యోగుల ఆవేదన

ఉద్యోగాలకు ప్రిపరేషన్ అయ్యే అభ్యర్థులకు అన్ని విభాగాల పుస్తకాలు, స్టడీ మెటీరియల్ అందుబాటులో లేకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. నవలలు, కథల పుస్తకాలు, చరిత్ర, ఆరోగ్యానికి సంబంధించిన పుస్తకాలతో పాటు మాసపత్రికలు అందుబాటులో లేక పోవడంతో సాహిత్యాభిమానులు నిరాశ చెందుతున్నారు. గ్రంథాలయ భవన నిర్మాణం కోసం గ్రామ పంచాయతీ పాలకమండలి సభ్యులతో పాటు మండల ప్రజా ప్రతినిధులు స్థలాన్ని ఎంపిక చేసి సంబంధిత అధికారులకు పంచాయతీ తీర్మాన పత్రాన్ని అందజేశారు. అయినా ఏళ్లు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మండల కేంద్రంలో ఆధునిక హంగులతో గ్రంథాలయాన్ని నిర్మిస్తే, మండల పరిధిలోని 24 గ్రామ పంచాయతీల నిరుద్యోగులకు, విద్యార్థులకు, పుస్తక ప్రియులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని చెబుతున్నారు.

అప్‌గ్రేడ్ చేయాలి



ప్రస్తుతం మండల కేంద్రంలో కొనసాగుతున్న గ్రామీణ గ్రంథాలయం విద్యార్థులు, నిరుద్యోగుల అవసరాలకు ఏ మాత్ర సరిపోవడం లేదు. నాలుగైదు దినపత్రికలు, కొన్ని పుస్తకాలు మాత్రమే ఉన్నాయి. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కడ్తాల్ గ్రంథాలయాన్ని అప్‌గ్రేడ్ చేయాలి.

– రాఘవేందర్, తెలంగాణ యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు, కడ్తాల్

స్టడీ మెటీరియల్ అందుబాటులో ఉంచాలి



గ్రంథాలయాన్ని అభివృద్ధి చేయడం వలన మరిన్ని సౌకర్యాలు సమకూరుతాయి. నిరుద్యోగులు అన్ని రకాల పోటీ పరీక్షల్లో పాల్గొనాలంటే ఖరీదైన పుస్తకాలు కొనుగోలు చేయలేక ఇబ్బంది పడుతున్నారు. గ్రంథాలయాన్ని అభివృద్ధి చేసి, పోటీ పరీక్షలకు ఉపయోగపడే మెటీరియల్ అందుబాటులో ఉంచాలి.

– నదీమ్, నిరుద్యోగి, కడ్తాల్.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తా



కడ్తాల్ మండల కేంద్రంలో ప్రస్తుతం ఉన్న మినీ గ్రంథాలయాన్ని అప్‌గ్రేడ్ చేసేందుకు కృషి చేస్తున్నాం. సమస్యను స్థానిక ఎమ్మెల్యేతో పాటు, సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడటం జరుగుతుంది. ఎమ్మెల్యే సహకారంతో గ్రంథాలయ భవనానికి నిధులు మంజూరు చేయించి, ఆధునిక హంగులతో గ్రంథాలయ భవనం నిర్మించేందుకు కృషి చేస్తున్నాం.

– గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ, కడ్తాల్

ఆమనగల్లు అభివృద్ధికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న విద్యానగర్‌కాలనీ వాసులు

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రకటించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి మంజూరైన నిధులతో అవసరమైన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విద్యానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాషా ఆధ్వర్యంలో కాలనీ వాసులు ఆదివారం హైదరాబాద్‌లో నారాయణరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా కసిరెడ్డిని సత్కరించారు. అనంతరం విద్యానగర్ కాలనీలోని సమస్యలపై వినతిపత్రం అందజేశారు. విద్యానగర్ కాలనీలో లో ఓల్టేజీ కారణంగా ఇబ్బందులు పడుతున్నామని, గృహోపకరణాలు దెబ్బతింటున్నాయని వివరించారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. సీసీ రోడ్లు నిర్మించాలని, కమ్యూనిటీహాలు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. పాలకవర్గం, ప్రజల సహకారంతో ఆమనగల్లును ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యానగర్‌కాలనీసంఘం అధ్యక్షుడు పాషా, ప్రధాన కార్యదర్శి జంగయ్య, కోశాధికారి సుదర్శన్‌రెడ్డి, సభ్యులు శేఖర్, వెంకటేశ్వర్ రెడ్డి, పత్యానాయక్, పర్వతాలు, సింగిల్‌విండో వైస్ చైర్మన్ సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

మండల వ్యవసాయాధికారి తులసి



అప్‌డేట్ చేయిస్తున్న వ్యవసాయాధికారులు

చేవెళ్ల: పీఎం కిసాన్ డబ్బుల కోసం తప్పని సరిగా ఈకేవైసీ అప్‌డేట్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి తులసి పేర్కొన్నారు. చేవెళ్ల మండల పరిధిలోని గుండాల గ్రామంలో ఆదివారం వ్యవసాయాధికారులు పర్యటించారు. అక్కడ ఈకేవైసీ అప్‌డేట్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ముందుగానే దప్పుచాటింపు వేయించి అవగాహన కల్పించారు. కేంద్రప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద ఏడాదికి మూడు విడుతల్లో రూ. 6వేలు వారి ఖాతాలో జమచేస్తున్నారన్నారు. అయితే ఎప్పటికప్పుడు రైతుల వివరాలు అప్‌డేట్ చేయిస్తూ అర్హులకు అందేవిధంగా కేంద్రం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. గతంలో ఎవరైనా భూములు అమ్ముకున్నా, కొత్త వారు తీసుకున్నా వారికికూడా ఈ పథకం కింద ప్రయోజనం చేకూరేవిధంగా కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈఏఓలు స్వాతి, ప్రియ, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముస్తాబు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని క్యాంపు కార్యాలయం కొత్త ఎమ్మెల్యే కోసం ముస్తాబు అవుతుంది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యేలకు క్యాంపు కార్యాలయాలను నిర్మించిన సంగతి తెలిసిందే. నాగార్జునసాగర్–హైదరాబాద్ రాహదారికి సమీపంలో ఖానాపూర్ గ్రామ పరిధిలో ఇబ్రహీంపట్నం క్యాంపు కార్యాలయాన్ని నిర్మించారు. రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఇక్కడ ఎమ్మెల్యేగా మల్‌రెడ్డి రంగారెడ్డి గెలుపొందారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కార్యాలయాన్ని ఖాళీ చేశారు. ఈ నేపథ్యంలో కొత్త ఎమ్మెల్యేగా ఎన్నికైన మల్‌రెడ్డి రంగారెడ్డి కొలువుదీరేందుకు క్యాంపు కార్యాలయాన్ని అన్ని హంగులతో ముస్తాబు చేస్తున్నారు. పాత టైయిల్స్‌ను తొలగించి కొత్త వాటిని వేశారు. శానిటరీ, ఎలక్ట్రికల్, పార్కింగ్ టైయిల్స్, పెయింటింగ్ పనులు దాదాపుగా పూర్తి కావొచ్చాయి. సుమారు రూ.15 లక్షల నిధులతో కార్యాలయ మరమ్మతు పనులు చేపడుతున్నారు. ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రవణ్ ప్రకాశ్, డీఈఈ వేణుగోపాల్‌రెడ్డి, ఏఈఈ వినోద్ పనులను పర్యవేక్షిస్తున్నారు. త్వరలోనే క్యాంపు కార్యాలయ గృహ ప్రవేశాన్ని ఎమ్మెల్యే మల్‌రెడ్డి చేయనున్నారు.



ఇబ్రహీంపట్నంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం

సీసీ రోడ్లు పూర్తి చేయాలి

ఎంపీపీ కొప్పు సుకన్య

యాచారం: ఈజీఎస్ నిధుల ద్వారా మంజూరైన సీసీ రోడ్లను వెంటనే పూర్తి చేయాలని ఎంపీపీ కొప్పు సుకన్య పంచాయతీ రాజ్ అధికారులకు సూచించారు. మండల పరిధిలోని యాచారం, మొగుళ్లవంపు, గాండ్లగూడెం గ్రామాల్లో ఈజీఎస్ నిధుల ద్వారా సీసీ రోడ్లు నిర్మించే కాలనీలను ఆదివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.4 కోట్లకు పైగా నిధులు మంజూరైనట్లు తెలిపారు. వెంటనే ఆయా గ్రామాల్లో సీసీ రోడ్లు పూర్తి చేయాలని సూచించారు. మార్చి 15 లోపే సీసీ రోడ్లు పూర్తి చేయాలని, లేని పక్షంలో మంజూరైన నిధులు వెనక్కుపోయే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈఈ ఉస్మాన్, పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీపీ కొప్పు సుకన్య

స్కావెంజర్లను నియమించండి

టీపీయూఎస్ గౌరవ అధ్యక్షుడు సురధీర్

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలలో పారిశుద్ధ్య కార్మికులను నియమించి పాఠశాలల పరిశుభ్రతకు కృషి చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) గౌరవ అధ్యక్షుడు సురధీర్ పేర్కొన్నారు. ఆదివారం చేవెళ్లలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జీఓ 317 ద్వారా స్థానికతను తుంగలో తొక్కారని, జిల్లాలకు బదిలీ చేసిన ఉద్యోగ ఉపాధ్యాయులను తిరిగి స్థానికత ఆధారంగా వారివారి జిల్లాలకు బదిలీ చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో నెం.57తో 2003 డీఎస్సీ నోటిఫికేషన్ ఆధారంగా పాత పెన్షన్ అమలు చేయాలని కోరారు. సీపీఎస్ విధానం రద్దు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానంతో ఆర్థిక భద్రత కల్పించాలని కోరారు. పెండింగ్ డీఏలను ప్రభుత్వం వెంటనే ప్రకటించి పీఆర్‌సీని ప్రకటించాలన్నారు. న్యాయపరమైన వివాదాలను పరిష్కరించి మల్టీజోన్ 2లో నిలిచిపోయిన బదిలీలను, పదోన్నతులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నూతన ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమలస్యపై స్పందించాలని వారు కోరారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు.

ఏసీపీ కిషన్‌కి అభినందనల వెల్లువ

చేవెళ్ల: చేవెళ్ల ఏసీపీ కిషన్‌ను మండలంలోని తంగడపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఆదివారం చేవెళ్ల ఏసీపీ కార్యాలయంలో తంగడపల్లి గ్రామస్తులు సన్మానం చేసి స్వాగతం పలికారు.

కాంగ్రెస్ నాయకులు..

వెంకట్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డి, మాజీ సర్పంచ్ మధుసూదన్‌గుప్తా, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.



ఏసీపీ కిషన్‌తో తంగడపల్లి బీఆర్‌ఎస్ నాయకులు

ముగిసిన బ్రహ్మోత్సవాలు

కడ్తాల్: కడ్తాల్ మండలం మక్తమాధారం గ్రామంలో వెలసిన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఆరు రోజుల పాటు, భక్తజన సందోహం మధ్య వైభవంగా ఉత్సవాలు కొనసాగాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయంలో నిత్యవిధి ,మహా పూర్ణాహుతి, చక్రస్నానం, ధ్వజా అవరోహణం, దేవతా విసర్జనం, పుష్పయాగం, సప్తవరణ మహాదాశీర్వాదం కార్యక్రమాలు నిర్వహించారు. పూజ కార్యక్రమాల్లో జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్ పాల్గొన్నారు. అదే విధంగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేశ్‌గౌడ్, బాల్‌రాజ్ వేదపండితులు రామానుజన్ చార్యులు, ఆదిత్యచార్యులు స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, భక్తులు

శెట్టిపల్లిలో అన్నదానం

ఆమనగల్లు: మండలంలోని శెట్టిపల్లిలో వెలసిన అలివేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. బ్రహ్మోత్సవాలకు పెద్ద సంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. బ్రహ్మోత్సవాలు ముగింపు సందర్భంగా ఆలయంలో స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు ముగింపు సందర్భంగా అర్చకులను మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి సత్యం, ఆలయ చైర్మన్ శ్రీనివాస్, ఆలయ ట్రస్టీ జగన్, మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి ఆధ్వర్యంలో సత్కరించారు.

ఉత్సవాలకు నేతల ఆహ్వానం

కడ్తాల్: మండల కేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను ఆహ్వానించారు. ఈ మేరకు ఆదివారం స్థానిక నాయకులు జైపాల్‌యాదవ్‌కు ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు లక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఆంజనేయులు, ఉత్సవ కమిటీ చైర్మన్ వేణుగోపాల్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు అశోక్, రాంచంద్రయ్య, రాజేందర్‌యాదవ్ తదితరులు ఉన్నారు.



జైపాల్‌యాదవ్‌కు ఉత్సవాల ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు

మాజీ ఎంపీపీకి ఆహ్వానం

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో వెలిసిన వేదాద్రి లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని మాజీ ఎంపీపీ శ్రీనివాస యాదవ్‌ను ఆదివారం ఆలయ ధర్మకర్త శ్రీనివాస మూర్తి, ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. అనంతం బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు అంబాజీ, శ్రీనివాసమూర్తి, మాజీ ఉప సర్పంచ్ అజీజ్, మహేశ్ నేత, నరేందర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, అశోక్‌గుప్తా, మోహన్‌లాల్, నర్సింహ, విజయ్, రవి పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

రెండు దశాబ్దాల తర్వాత కలుసుకున్న స్నేహితులు

ఆమనగల్లు: రెండు దశాబ్దాల క్రితం కలిసి చదువుకొని ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా కలుసుకొని సందడి చేశారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఇందుకు కడ్తాల మండలం మైసిగండిలోని మైసమ్మ దేవస్థానం వద్ద ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాలు వేదిక అయింది. ఆమనగల్లు పట్టణంలోని వివేకా విద్యాభారతి హైస్కూల్‌లో 2001–2002 విద్యా సంవత్సరంలో పదో తరగతి అభ్యసించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించుకున్నారు. 22 ఏళ్ల తరువాత కలుసుకున్నవారంతా యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆనాటి మధురస్మృతులను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు వెంకటేశ్వరశర్మ, కన్నాజీ, శివలింగం, యాదయ్య, ఆశాలత, హజ్ర, సుమతిని సత్కరించారు. సమ్మేళనంలో పాల్గొన్న వారికి జ్ఞాపికలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కండె సాయి, ఉదయకుమార్, వెంకటరమణ, రాజేంద్రప్రసాద్, దేవేందర్, వెంకటరాఘవ, అనిత, అరుణ, సుజాత, సూర్యచంద్రిక తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు జ్యోతి

మొయినాబాద్ రూరల్: గ్రామాల అభివృద్ధి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు జ్యోతిభీమ్ భరత్, ముఖ్యమంత్రి సోదరుడు కొండల్‌రెడ్డి, చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీమ్‌భరత్ పేర్కొన్నారు. ఆదివారం అమ్డాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రవళిగోపికృష్ణారెడ్డి 50 మంది బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పది సంవత్సరాలుగా సర్పంచులు గ్రామాలలో అభివృద్ధి పనులకోసం ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకాకున్న, వారి సొంత డబ్బులను వెచ్చించి గ్రామాల అభివృద్ధికి సహకరించారని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే వారు అప్పుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నేటికి గ్రామాల కోసం పెట్టిన బిల్లులు మంజూరు కాలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. కాంగ్రెస్ అమలు చేయనున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీ మారినట్టు సర్పంచ్ రవళిగోపికృష్ణారెడ్డి తెలిపారు. షాబాద్ దర్శన్, తమ్మలి మాణయ్య, జైపాల్‌రెడ్డి, పెంటారెడ్డి, భిక్షపతిముదిరాజ్, మహేందర్‌ముదిరాజ్, విజయ్‌రాజ్, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్, మహేందర్, నరేశ్, సురేశ్ పాల్గొన్నారు.



రవళిగోపికృష్ణారెడ్డికి కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానిస్తున్న జ్యోతిభీంభరత్

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంటేనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పేర్కొన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం ముష్టిపల్లి గ్రామంలో ఆదివారం శివరామాంజనేయ స్వామి దేవాలయంలో నాభిశిల, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ, నవగ్రహ, గణపతి విగ్రహ ప్రతిష్ఠతతోపాటు, కుమారస్వామి, నందీశ్వరస్వామి, పోచమ్మ, శ్రీకృష్ణుడి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ నిత్య జీవితంలో కొంత సమయం దైవారాధనకు కేటాయించాలన్నారు. చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కావలి రాజు, ఎంపీటీసీలు సత్యనారాయణ రెడ్డి, రజిత, చంద్రశేఖర్, బాల్‌రాజ్, నర్సింలు, పాపయ్య, సురేందర్, శేఖర్, రాములు నాయక్, రాజు, రాములు, శ్రీను, ఆంజనేయులు, వెంకటేశ్ పాల్గొన్నారు.



శివరామాంజనేయ స్వామి దేవాలయంలో పూజ చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్